సాక్షి
అనంతపురం
సోమవారం ၊ 21 ၊ అక్టోబర్ ၊ 2024



టమాట కిలో రూ.45

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.45 పలికింది. కనిష్టం రూ.25, సరాసరి రూ.36 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఆయిల్‌మిల్లులో అగ్నిప్రమాదం

రాప్తాడు సమీపంలోని ఓ వేరుశనగ ఆయిల్‌మిల్లులో అగ్నిప్రమాదం జరిగింది. సామగ్రి కాలిపోయింది. 8లో

గరిష్టం/కనిష్టం
35.6°/ 22.9°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడ్డాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పప్పుశనగ సాగుకు మంచి సమయం



అనంతపురం అగ్రికల్చర్: రబీసీజన్‌లో ప్రధాన పంటగా నల్లరేగడి భూముల్లో పప్పుశనగ విత్తుకునేందుకు ఇదే మంచి సమయమని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకర బాబు,సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణ స్వామి తెలిపారు. నవంబర్ 15వ తేదీ వరకూ సాగు చేసుకోవచ్చన్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా మంచి వర్షాలు కురిసినందున నల్ల రేగడి భూముల్లో పంట సాగు చేసుకోవాలని తెలిపారు. నంద్యాల గ్రామ్‌-1267, నంద్యాల గ్రామ్‌-776, నంద్యాల గ్రామ్‌-857, నంద్యాల గ్రామ్‌-452, నంద్యాల గ్రామ్‌-49, ధీర (ఎన్‌బీఈజీ-47), నంద్యాల సంగా, జేజీ-11, జాకీ-9218 లాంటి విత్తన రకాలు ఎంపిక చేసుకోవాలన్నారు. ఎకరాకు 30 నుంచి 35 కిలోల విత్తనం సరిపోతుందన్నారు. విత్తుకునే ముందు కిలో విత్తనానికి 8 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీ, 3 గ్రాములు థైరామ్ లేదా 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకుంటే రోగాలను చాలా వరకు నివారించవచ్చని తెలిపారు. కలుపు నివారణకు ఎకరాకు పెండిమిథాలీన్ 1,000 నుంచి 1,400 మి.లీ కలుపు మందు 200 లీటర్ల నీటికి కలిపి విత్తిన 24 నుంచి 48 గంటల్లోపు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కాగా, నల్లరేగడి భూములు కలిగిన 22 నుంచి 25 మండలాల పరిధిలో ఈ సారి 75 వేల నుంచి 80 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పప్పుశనగ పంట సాగులోకి రావచ్చని అధికారులు అంచనా వేశారు. తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం డివిజన్ల పరిధిలో సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అందుకు తగ్గట్లు సకాలంలో వర్షాలు పడటంతో రబీ ఏరువాక జోరుగా సాగనుందని చెబుతున్నారు.

నేటి నుంచి ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రాథమిక పాఠశాలల్లో 1,2 తరగతులు బోధించే టీచర్లకు సోమవారం నుంచి ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసి (ఎఫ్‌ఎల్‌ఎన్) శిక్షణ ప్రారంభం కానుంది. బుక్కరాయసముద్రం మండలంలోని విజయ భారతి డీఎడ్ కళాశాల వేదికగా శిక్షణ జరగనుంది. అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి టీచర్లు హాజరుకానున్నారు. తొలివిడత శిక్షణ ఈనెల 26 వరకు ఉంటుంది. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే శిక్షణకు 6 రోజులకు అవసరమైన దుస్తులు, కప్పుకోవడానికి దుప్పటి తెచ్చుకోవాలని సమగ్ర శిక్ష అధికారులు సూచిస్తున్నారు. శిక్షణా కేంద్రంలోనే మంచం, పరుపు, దిండు, బెడ్ షీట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు నిపుణుల చేత యోగ, ధ్యానం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందుకనుగుణంగా ఉండే దుస్తులను కూడా తెచ్చుకోవాలని సూచించారు. మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా వసతి ఏర్పాటు చేశామన్నారు. అత్యవసరమైన మందులు వాడేవారు 6 రోజులకు సరిపోయేలా తెచ్చుకోవాలంటున్నారు. బంగారు ఆభరణాలు లాంటి విలువైన వస్తువులను వెంట తెచ్చుకోరాదన్నారు. అవసరమైనంత మేరకే డబ్బులు తెచ్చుకోవాలని సూచించారు. ఏవైనా విలువైన వస్తువులు మిస్ అయితే శిక్షణా కార్యక్రమం నిర్వాహకులు బాధ్యత వహించరని స్పష్టం చేశారు. 6 రోజులు పూర్తిగా శిక్షణా కేంద్రం లోనే ఉండాలని, ఎవరికీ మినహాయింపు ఉండదన్నారు. శిక్షణా కార్యక్రమం జరిగే సమయంలో సెల్‌ఫోన్లు అనుమతించబోమన్నారు. శిక్షణ వేదిక గూగుల్ లొకేషన్ లింక్ https:// maps. app. goo. gl/ E4 nFiE4 kFkK7 K5 GN7? g& st= iwను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మింగేస్తున్న వేగం

☛ పామిడి మండలం కండ్లపల్లికి చెందిన రాముడు, సుధాకర్ ఈ నెల 5న గార్లదిన్నె మండలం మర్తాడులో శుభకార్యానికి హాజరయ్యారు. కార్యక్రమం ముగించుకుని తిరిగి వస్తుండగా తిమ్మంపేట వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సేఫ్టీ రేకును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రాముడు (35)ను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స ఫలించక మృతి చెందాడు.

☛ అనంతపురం పాపంపేటకు చెందిన ఓ యువకుడు ఇటీవల తన స్కూటీపై వేకువజామున మసీదుకు బయలుదేరాడు. రాజా హోటల్ సమీపంలో మరో యువకుడు లిఫ్ట్ అడగడంతో అతన్ని బైక్‌పై ఎక్కించుకున్నాడు. కాస్త ముందుకు వెళ్లగా ఎదురుగా రాంగ్ రూట్‌లో బుల్లెట్‌పై వచ్చిన ఓ యువకుడు స్కూటీని బలంగా ఢీ కొన్నాడు. ప్రమాదంలో ముగ్గురు యువకులూ తీవ్రంగా గాయపడ్డారు.

- ప్రాణాలు కబళిస్తున్న రోడ్డు ప్రమాదాలు
- జిల్లావ్యాప్తంగా నాలుగేళ్లలో 1,271 మంది మృతి
- మృతుల్లో 75 శాతం మంది 40 ఏళ్ల లోపువారే
- జాతీయ రహదారుల్లోనే ఎక్కువ యాక్సిడెంట్లు
- వేగ నియంత్రణతోనే ప్రయాణం సురక్షితమంటున్న అధికారులు



జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	క్షతగాత్రులు	మృతులు
2021	592	658	351
2022	540	588	331
2023	532	578	350
2024 (సెప్టెంబర్ వరకు)	384	439	239

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయి. ప్రమాదాల సంఖ్య ఏటేటా పెరుగుతోందే కానీ తగ్గడం లేదు. చేతికంది వచ్చిన పిల్లలు రోడ్డు ప్రమాదాల్లో చనిపోతుండటంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోతున్నారు. చెట్టంత కొడుకు ప్రమాదంలో గాయపడి తమ కళ్ల ముందే దివ్యాంగుడిగా మారుతుండటం చూసి తట్టుకోలేకపోతున్నారు. బయటకు వెళ్లిన వారు తిరిగి ఇంటికి చేరే వరకూ ఆయా కుటుంబాలు భయం భయంగా గడుపుతోన్న పరిస్థితి నెలకొంది.

ఏటా వందల్లో కన్నుమూత..

జిల్లాలో ఏటా 350 మందికి పైగా ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. మృతుల్లో 75 శాతం మంది 40 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని అప్పుడప్పుడే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్న వారు కూడా మృత్యు కౌగిలిలో ఇరుక్కుపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదాల్లో క్షతగాత్రుల సంఖ్య కూడా తక్కువగా ఉండటం లేదు. హెల్మెట్ లేకపోవడం వల్ల చాలా మంది మృత్యు ఒడిలోకి చేరుకుంటుండగా, చాలా మంది కాళ్లు, చేతులు విరిగి శాశ్వత వికలాంగులుగా మారిపోతుండటం కలచి వేస్తున్న అంశం.

జాతీయ రహదారుల్లోనే..

రోడ్డు ప్రమాదాల్లో సింహభాగం జాతీయ రహదారుల్లోనే జరుగుతున్నట్టు రవాణాశాఖ అధికారుల పరిశీలనలో వెల్లడైంది. 2021 నుంచి 2024 సెప్టెంబర్ వరకూ జిల్లాలో 1,271 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందగా.. ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 42, ఎన్‌హెచ్ 544డీపైనే ఎక్కువగా ప్రాణాలు కోల్పోయినట్లు తేలింది. ఇక.. ప్రమాదానికి ప్రధాన కారణం అతి వేగమేనని అధికారులు నిర్ధారించారు. 150 సీసీ, ఆపైన సామర్థ్యం కలిగిన వాహనాలను ఎక్కువ మంది యువకులు వాడుతున్నారు. గంటకు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను అంచనా వేయలేకపోవడం,అదుపుతప్పి డివైడర్లను ఢీకొనడంతో మృతి చెందుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనంతపురం పాపంపేటకు చెందిన యువకుడు (ఫైల్)

వేగమే కొంపముంచుతోంది



వాహనాల్లో ఎక్కువ స్పీడుగా వెళ్తుండటం వల్లే 80 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. యువకులైతే మరీ వేగంగా వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఎన్నోరకాలుగా వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ప్రమాద ప్రాంతాల్లో సూచీలు ఏర్పాటు చేస్తున్నాం. అయినా వేగంగా వెళ్లడం ఫ్యాషన్ అనుకుంటున్నారు. పిల్లలకు సామర్థ్యానికి మించిన బైకులు ఇస్తున్నప్పుడు తల్లిదండ్రులు కూడా ఆలోచించాలి.
– వీర్రాజు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

సమస్యల పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి కేశవ్

అనంతపురం టవర్‌క్లాక్: సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. మడకశిరలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కేజీబీవీ పోస్టుల మెరిట్ జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టుల భర్తీలో భాగంగా తాత్కాలిక మెరిట్ జాబితాను సిద్ధం చేశారు. మూడు రోజుల కిందట అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితాను తయారు చేసి https://samagrashikshaatp.blogspot.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 4 గంటలలోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని ఏపీసీ నాగరాజు తెలియజేశారు.

రబీ గట్టెక్కించేనా..?

- తుడిచిపెట్టుకుపోయిన ఖరీఫ్ పంటలు
- అన్నదాతలకు తీరని నష్టం
- రబీ పంటలపై రైతుల దృష్టి



పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడులు లెక్కిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ నిరాశ మిగల్చడంతో రబీ సీజన్ అయినా గట్టెక్కిస్తుందేమోననే గంపెడాశతో అన్నదాతలు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈశాన్య రుతుపవనాల ప్రభావం మొదలైంది. అక్టోబర్‌లో 100.9 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇటీవల మంచి వర్షాలు కురవడంతో ఆ మేర వర్షపాతం నమోదైంది. ఇక నవంబర్‌లో 28.6 మి.మీ, డిసెంబర్‌లో 9.8 మి.మీ వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేస్తున్నారు.

1.18 లక్షల హెక్టార్లలో పంటలు!

రబీలో 1.18 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేశారు. అందులో ప్రధానపంట పప్పుశనగ 22 మండలాల పరిధిలో 75 వేల నుంచి 80 వేల హెక్టార్లు, ఆ తర్వాత వేరుశనగ 20 వేల హెక్టార్లు, మిగతా పంటలు 20 వేల హెక్టార్లలో వేయొచ్చని చెబుతున్నారు. మార్చి నాటికి రబీ పంట కోతలు పూర్తవుతాయి.

దారుణంగా దెబ్బతీసిన ఖరీఫ్..

జిల్లాకు ఖరీఫ్ సీజన్ అత్యంత కీలకం. ఈ సారి నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే అంటే జూన్ 2న ప్రవేశించినా సరైన సమయంలో పెద్దగా ప్రభావం చూపించలేదు. విత్తుకు కీలకమైన జూన్ నుంచి జూలై 15 వరకు కీలక సమయంలో వరుణుడు మొహం చాటేయడంతో అరకొర తేమలోనే పంటలు వేశారు. 3.46 లక్షల హెక్టార్లకు గానూ 92 శాతం విస్తీర్ణంతో 3.20 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగైంది. అందులో వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, మొక్కజొన్న, కొర్ర, సజ్జ, పొద్దుతిరుగుడు, ఉలవ, పెసర, అలసంద, మినుము, సోయాబీన్ తదితర 15 రకాల పంటలు సాగు చేశారు. ఆ తర్వాత ఆగస్టులో మంచి వర్షాలు కురిసినా సెప్టెంబర్‌లో చేయిచ్చాయి. మొత్తంగా ఈ ఖరీఫ్‌లో 34.9 శాతం అధికంగా 431.3 మి.మీ వర్షపాతం నమోదైనా, భారీ వర్షాల ధాటికి పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. వేరుశనగ పంట కోత ప్రయోగాలు పరిశీలిస్తే ఎకరాకు 2 బస్తాలు కూడా దిగుబడులు కష్టంగా కనిపిస్తున్నాయి. పత్తి, ఆముదం కూడా ఒకట్రెండు కోతలకే పరిమితం కావచ్చంటున్నారు. ఆశలు రేకెత్తించిన కంది పంటేమో ఇటీవల వర్షాలు, వాతావరణ పరిస్థితులకు పూత రాలిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓవరాల్‌గా ఖరీఫ్ రైతులను దెబ్బతీయగా రబీ ఏ మేరకు గట్టెక్కిస్తుందనేది వేచిచూడాలి.

కరువు మండలాలపై ప్రకటనేదీ..?

పంటలు తుడిచిపెట్టుకుపోయిన తరుణంలోనూ కరువు మండలాలను ప్రకటించకుండా కూటమి సర్కారు జాప్యం చేస్తుండటంతో రైతులకు అన్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పంటల బీమా కింద పరిహారం, ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న సర్కారు నేడు కరువు సాయం కూడా చేసే పరిస్థితి కనిపించడం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- ఇసుక, మద్యం దందాపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదా?
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు ఇసుక, మద్యం దందాపై ఉన్న శ్రద్ధ రైతాంగంపై లేదని, రైతులను ఆదుకోవడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలను మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని, అలాంటి రైతు పరిస్థితి నేడు దయనీయంగా మారిందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకప్పుడు 18 లక్షల నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటల సాగు ఉంటే వేరుశనగ మాత్రమే 15 లక్షల ఎకరాల వరకు సాగయ్యేదని గుర్తు చేశారు. కానీ, ఈ ఏడాది 6 లక్షల ఎకరాల్లోనే వేరుశనగ సాగవగా, ఇటీవల కురిసిన వర్షానికి అది కూడా తుడిచి పెట్టుకుపోయిందన్నారు. పంట నష్టం అంచనా వేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఉద్యాన, వ్యవసాయ పంటలు కలిపి రూ.1.48 కోట్లు మాత్రమే నష్టం జరిగిందని ప్రభుత్వానికి లెక్కలు పంపారంటే ఎంత అధ్వాన పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

నీటి నిర్వహణలోనూ నిర్లక్ష్యమే..

తుంగభద్ర, హంద్రీనీవా నీటి నిర్వహణలోనూ ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అనంత విమర్శించారు. హెచ్‌ఎల్‌సీ ద్వారా 14 టీఎంసీలపైన నీరు వచ్చిందని చెబుతున్నా ఏ డిస్ట్రిబ్యూటరీకి ఎంత ఇచ్చారో లెక్కలు లేవన్నారు. ఏడు నుంచి ఎనిమిది టీఎంసీలకే లెక్కలు చెబుతున్నారని, మిగిలిన నీరు ఎక్కడ వాడారో తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని ప్రశ్నించారు. ఎంపీఆర్ నార్త్ కెనాల్‌కు ఈ నెల 1న నీరు విడుదల చేస్తామని చెప్పినా ఇంత వరకు అతీగతీ లేదన్నారు. సౌత్ కెనాల్‌కు సంబంధించి ముచ్చుకోట, సుబ్బరాయసాగర్‌కు నీరు అందని పరిస్థితి ఉందన్నారు. ఇక్కడికి నీరు చేరితే పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి రూరల్ మండలాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులను విత్తన కొరత వేధిస్తోందన్నారు. తమ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో 40 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ అందిస్తే నేడు దాన్ని 25 శాతానికి కుదించి రైతులపై భారం మోపారన్నారు. క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల కొరత వేధిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. యూరియా, పొటాష్ బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందన్నారు. ఆర్‌బీకేల్లో ఇస్తే వైఎస్ జగన్‌కు పేరు వస్తుందని భావిస్తే సొసైటీల్లో అయినా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

జెడ్పీ సమావేశాలకు గైర్హాజరైతే ఎలా?

ఈ నెల 19న జరిగిన జెడ్పీ సమావేశానికి 63 మండలాల నుంచి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు హాజరైతే ఎంపీలు, ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారని, దీన్ని బట్టి ప్రజా సమస్యల పట్ల వారికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతోందన్నారు. వర్షాకాలంలోనూ తాగునీటి సమస్య నెలకొన్న నేపథ్యంలో రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ముగ్గురు మంత్రులు జిల్లా పరిస్థితుల గురించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కూటమి సర్కారు నిర్లక్ష్యం వీడకపోతే రైతుల సమస్యలపై ప్రత్యక్ష పోరుకు కూడా సిద్ధమని ఆయన ప్రకటించారు.

గొంతు నులిమి మహిళ దారుణహత్య



హత్యకు గురైన నాగమ్మ

అనంతపురం: నగరంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం ఉప్పొంకకు చెందిన నాగమ్మ, నాగప్ప దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కొంత కాలం క్రితం భర్తతో నాగమ్మ విడిపోయారు. అనంతపురంలోని ఎర్రనేలకొట్టాలకు వచ్చి ఓ భవనంలోని పై పోర్షన్‌ను అద్దెకు తీసుకుని ఉంటున్నారు. స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలైనా పనికి రాకపోవడంతో నాగమ్మకు హోటల్ యజమాని ఫోన్ చేశారు. ఎన్ని సార్లు కాల్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఆమె కింది పోర్షన్‌లో ఉంటున్న వారికి సమాచారం అందించారు. ఈ క్రమంలోనే వారు వెళ్లి చూడగా మంచంపై నాగమ్మ విగతజీవిగా కనిపించారు. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం చుట్టూ కారం పొడి చల్లినట్లు గుర్తించారు. పోలీసు జాగిలాల నుంచి తప్పించుకునే ఉద్దేశంతోనే ఇలా చేశారని, దీన్ని బట్టి నేరాల్లో ఆరితేరిన వారే ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శనివారం రాత్రే నాగమ్మను హత్య చేసినట్లు పోస్టుమార్టంలో తేలింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతురాలి వద్ద బంగారును కాజేసే ఉద్దేశంతోనే హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. హత్యకు పాల్పడిన వారు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.



ఘటనాస్థలి వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ..

హత్య విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ పి.జగదీష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీఎస్పీ నేతృత్వంలో విచారణకు ఆదేశించారు. డాగ్‌స్క్వాడ్, క్లూజ్‌టీంలను అప్రమత్తం చేశారు. ఎస్పీ వెంట అనంతపురం అర్బన్ డీఎస్పీ వల్లూరు శ్రీనివాసరావు, సీఐలు ఉన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఇద్దరి దుర్మరణం
- ఓ మహిళకు తీవ్ర గాయాలు



బాలుడు లక్ష్మీరాం



చరణ్‌రాజ్, మనీషా దంపతులు (ఫైల్)



చరణ్ రాజ్ మృతదేహం

తాడిపత్రి/యాడికి: ఆర్టీసీ బస్సు బైకును ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తాడిపత్రి మండల పరిధిలోని చుక్కలూరు గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సీఐ శివ గంగాధర్ రెడ్డి తెలిపిన మేరకు.. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బిజనవేముల గ్రామానికి చెందిన చరణ్ రాజ్ (30), మనీషా దంపతులు. వీరికి సంతానం లేదు. చరణ్ రాజ్ సోదరి సుమిత్రని యాడికి ఓం శాంతి కాలనీకి చెందిన రాముడుకు ఇచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చరణ్‌రాజ్ దంపతులు రెండు సంవత్సరాలు క్రితం ఉపాధి నిమిత్తం యాడికి వచ్చి ఓం శాంతి కాలనీలోనే నివాసముంటున్నారు. రెండు కుటుంబాలూ మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాయి. బత్తలపల్లి మండలం ముద్దనపల్లిలోని తమ బంధువుల ఇంట్లో ఆదివారం పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి చరణ్‌రాజ్, రాముడు కుటుంబాలు వెళ్లాయి. వేడుక ముగిసిన అనంతరం చరణ్‌రాజు, మనీషా దంపతులు బైకుపై, రాముడు, మరికొంత మంది కారులో స్వగ్రామం బయలుదేరారు. ఈ క్రమంలోనే రాముడు చిన్న కుమారుడు లక్ష్మీరాం (8) తన మేనమామ చరణ్‌రాజ్ బైకులో వస్తానంటూ మారాం చేయటంతో బాలుడిని అతను బైక్‌పై ఎక్కించుకుని ముందుకు కదిలాడు. మార్గంమధ్యలో తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామ సమీపంలో బైకును గుత్తి నుంచి తాడిపత్రి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన చరణ్‌రాజ్, బాలుడు లక్ష్మీరాం ఘటనాస్థలిలోనే ప్రాణాలు వదిలారు. తీవ్రగాయాలైన మనీషాను స్థానికులు 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాద ధాటికి బాలుడు లక్ష్మీరాం ఒక చెయ్యి, కాలు తెగి పడ్డాయి. చరణ్‌రాజ్ కాలు కూడా తెగిపడటంతో ఆ ప్రాంతం భీతావహంగా మారింది. కాగా, ప్రమాద సమాచారం అందుకున్న రాముడు, సుమిత్ర దంపతులు ఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత 'ఎస్‌ఎస్‌బీఎన్'



విజేత జట్టుతో ఎస్కేయూ క్రీడా కార్యదర్శి డాక్టర్ బి.జెస్సీ

అనంతపురం: ఎస్కేయూ అంతర కళాశాలల టోర్నీ గ్రూప్‌-బీ పోటీల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రత్యర్థి ఎస్కేయూ జట్టుపై 53 పాయింట్ల తేడాతో ఎస్‌ఎస్‌బీఎన్ జట్టు ఘన విజయం సాధించింది. ఎస్‌ఎస్‌బీఎన్ 74 పాయింట్లు, ఎస్కేయూ 21 పాయింట్లు సాధించాయి. కబడ్డీ ఫైనల్ పోటీలు సోమవారం జరగనున్నాయి.

క్లుప్తంగా

వైభవంగా సత్యసాయి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ: సమాజంలో ప్రేమ తత్వాన్ని చాటిన సత్యసాయిబాబా అవతార ప్రకటన రోజు సందర్భంగా ఆదివారం ఉరవకొండలో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సత్యసాయి చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి, పుష్పాలతో అలంకరించి భజనలు, మేళ తాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. వస్త్ర దానం, అన్నదానం కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర, ఆధ్యాత్మిక విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ శైలజ, సేవా విభాగం కన్వీనర్ అనురాధ, అనంతపురం సమితి కన్వీనర్ నరసింహప్ప, ఉరవకొండ సమితి కన్వీనర్ దాసెట్టి రామాంజినేయులు, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

రైలులో గుర్తు తెలియని మహిళ మృతి



గుత్తి: కేకే ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలు గుండె పోటుతో మృతి చెందింది. రాయచూరులో రైలు జనరల్ బోగీలో ఎక్కిన ఆమె గుత్తి సమీపంలోకి చేరుకోగానే ఛాతీలో విపరీతమైన నొప్పితో విలవిల్లాడుతూ సీటులోనే కుప్పకూలింది. ప్రయాణికుల నుంచి సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు గుత్తిలోకి రైలు చేరుకోగానే వైద్యుడి సాయంతో పరీక్షలు చేయించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారణ కావడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే గుత్తి రైల్వే పోలీసులను సంప్రదించాలని జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప కోరారు.

విద్యార్థిని ఆత్మహత్య



మృతురాలు జయశ్రీ

పుట్లూరు: తరగతి గదిలో పాఠం అర్థం కాకపోవడంతో మనస్తాపం చెంది ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు సమాచారం మేరకు... పుట్లూరు మండలం బాలాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి, సరళరాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె జయశ్రీ (16) అనంతపురంలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె... తనకు గణితం పాఠాలు అర్థం కావడం లేదని, ఇలాగే అయితే తాను ఇంటర్ ఉత్తీర్ణత సాధించడం కూడా కష్టమేనంటూ తల్లిదండ్రులతో చెప్పుకుని బాధపడింది. దీంతో తల్లిదండ్రులు సముదాయించారు. విషయాన్ని కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా మాట్లాడతామని భరోసానిచ్చారు. అప్పటికే తీవ్ర మనోవేదనలో ఉన్న జయశ్రీ.... శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు... ఉరికి విగత జీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ హేమాద్రి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మీ త్యాగం... అజరామరం

- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

సందర్భం : నేడు పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం

అనంతపురం: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అనునిత్యం పోరాడుతున్నారు. ప్రజలందరూ ప్రశాంతంగా ఉంటున్నారంటే దానికి పోలీసులే కారణం. తీవ్రవాదం, అసాంఘిక శక్తుల నుంచి ప్రజలను కాపాడేందుకు కొంత మంది పోలీసులు ప్రాణాలను సైతం త్యాగం చేశారు. వారి త్యాగాలను స్మరించుకునేందుకు ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్‌డే) నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోనూ సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ప్రాణాలను తృణప్రాయంగా..

విధి నిర్వహణలో అసాంఘిక శక్తుల కుట్రలకు బలైన పోలీసు అమర వీరులను గుర్తు చేసుకోవడంతో పాటు సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజలను చైతన్య పరిచేలా పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు. 1959, అక్టోబర్ 21న దేశ భద్రత కోసం భారత్, చైనా సరిహద్దుల్లో ఉన్న లడఖ్ అక్సాయ్‌చిన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లపై భారీ సంఖ్యలో చైనా సైనికులు విరుచుకుపడ్డారు. సంఖ్యా బలం తక్కువగా ఉన్నా.. భారత జవాన్లు ఆత్మస్థైర్యంతో చైనా సైనికులను ఎదిరించి తమ చివరి రక్తం బొట్టు వరకూ పోరాడారు. దేశ రక్షణలో వారు అమరులయ్యారు.



జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్మృతి చిహ్నం

ఈ ఘటనను పురస్కరించుకుని ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. దేశ వ్యాప్తంగా మావోయిస్టులు, ఉగ్రవాదులు, ఇతర అసాంఘిక శక్తులతో పాటు అల్లర్లు, అలజడులను అణచివేసే క్రమంలో అమరులైన పోలీసు సిబ్బందినీ స్మరిస్తూ అనంతపురంలోని డీపీఓలో సోమవారం పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్మృతి పరేడ్‌తో అమరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు..

పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజలను చైతన్య పరిచేలా వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు 'రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షివ్ ఆఫ్ సైబర్ క్రైం', 'ఛాలెంజెస్ టు పోలీస్ ఇన్ ద ప్రజెంట్ ఎన్విరాన్‌మెంట్ ' అనే అంశాలపై జిల్లా వ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు, పోలీసు పిల్లలకు చర్చావేదికలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాలను ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా సినిమా హాళ్లతో పాటు స్థానిక కేబుల్ ఆపరేటర్ల ద్వారా ప్రతి ఇంట్లోని వారూ వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 26 నుంచి 27వ తేదీ వరకు ఓపెన్ హౌస్‌ల నిర్వహణ ఉంటుంది. ఈ నెల 28న వైద్య శిబిరాలు, రక్తదానాలు, 28 నుంచి 30వ తేదీ వరకు పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శన, పోలీసుల త్యాగాలను గుర్తుచేసే పాటల ఆలాపన ఉంటుంది. 29న సెమినార్లు, ఉపన్యాసాలు, నాటికలు, పాటల రూపంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులను సన్మానించనున్నారు. 31న ప్రజల సహకారంతో జిల్లా వ్యాప్తంగా సమైక్యతా దినం పాటిస్తారు. సాయంత్రం 6 గంటలకు పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ ఉంటుంది.

అన్ని విధాలుగా అండగా ఉంటాం



విధి నిర్వహణలో వివిధ కారణాలతో పోలీసులు మృతి చెందడం బాధాకరం. వారి కుటుంబ సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది. ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలు అందేలా చూస్తాం. సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తాం. ఆయా కుటుంబాలకు జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుంది. – పి. జగదీష్, ఎస్పీ

మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి

- ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు



మాట్లాడుతున్న గణపతిరావు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో 'ఆప్టా' రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గణపతిరావు మాట్లాడుతూ.... జీఓ 117 రద్దు చేసి ప్రతి గ్రామ ప్రాథమిక పాఠశాలల్లోనూ 1 నుంచి 5 వరకు తరగతులు పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి ప్రకటించి 12వ పే రివిజన్ కమిషన్ నియమించాలని కోరారు. త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిగ్రీ అర్హత ఉన్న ఎస్జీటీలకూ ఓటు హక్కును కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. టీచర్లకు యాప్‌ల భారం తగ్గించాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహడి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఆర్.మురళీమోహన్ మాట్లాడుతూ ఎంటీఎస్ టీచర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. పీటీఐలకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు సి.గోపాల్‌రెడ్డి, కె.వెంకటరత్నం మాట్లాడుతూ గతంలో ఉన్న విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని విద్యా హక్కు చట్టం ప్రకారం నిర్ణయించాలన్నారు. 12 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ కేడర్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఆప్టా కర్నూలు జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నాయకులు శంకరమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, నారాయణ, కుళ్లాయప్ప, సూర్యనారాయణ, నరేష్, వలి, సుంకన్న లింగన్న పాల్గొన్నారు.

ఆయిల్ మిల్లులో అగ్ని ప్రమాదం



అగ్నికి ఆహుతైన వేరుశనగ కాయలు

- రూ.5 కోట్ల నష్టం!



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాప్తాడు: మండలకేంద్రం సమీపంలోని ఓ ఆయిల్ మిల్లులో అగ్ని ప్రమాదం జరిగింది. అందులోని సామగ్రి మొత్తం కాలిపోయింది. దీంతో బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. అనంతపురం నగరానికి చెందిన మాధవనాయుడు రాప్తాడు పంచాయతీలోని ముస్లిం మైనార్టీ కాలనీ సమీపంలో ఆరేళ్ల క్రితం గణేష్ ట్రేడర్స్ పేరుతో వేరుశనగ ఆయిల్ మిల్‌ను ప్రారంభించారు. బయటి ప్రాంతాల్లో వేరుశనగ కాయలను కొనుగోలు చేసిన అనంతరం మిల్లులో ఆయిల్‌ను ఆడించి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసే వారు. ఈ క్రమంలో అక్కడే ఓ గోడౌన్‌లో వేరుశనగ కాయలు, మరో గోడౌన్‌లో వేరుశనగ పప్పు, ఇంకో గోడౌన్‌లో ఆయిల్ స్టాక్ ఉంచారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గోడౌన్లలోకి వర్షపు నీరు చేరి అంతా బురదమయంగా మారింది. దీంతో మిషన్లతో పాటు దాదాపు రూ.6 కోట్ల స్టాక్ నిలబడి పోయింది. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి గోడౌన్లలో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానిక కాలనీకి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో మాధవనాయుడు ఇంటికి వెళ్లి సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆయన తన కుమారుడు మౌర్య కుమార్‌తో ఘటనాస్థలికి చేరుకోగా.. అప్పటికే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. సమాచారం అందుకున్న అనంతపురం అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. అయితే, అప్పటికే స్టాక్ మొత్తం కాలిపోయింది. వేరుశనగ కాయలు, పప్పు, ఆయిల్‌తోపాటు మిషనరీ కలుపుకుని దాదాపు రూ. 5 కోట్ల నష్టం వాటిలినట్లు బాధితుడు వాపోయారు. జిల్లా అగ్ని మాపక అధికారి వి.శ్రీనివాసా రెడ్డి, ఏడీఎఫ్ఓ లింగమయ్య, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ టీ.వి.శ్రీహర్ష మాధవనాయుడితో మాట్లాడారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో సాగునీటి నిర్వహణ దయనీయం

- సమస్యల పరిష్కారానికి నేడు తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయండి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



విలేకరులతో మాట్లాడుతున్న రాంభూపాల్, నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లాలో సాగునీటి నిర్వహణ అత్యంత దయనీయంగా ఉందని, ఫలితంగా ఆయకట్టుకు సాగు నీరు అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగభద్ర, శ్రీశైలం డ్యాంలు పొంగిపొర్లుతున్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా రైతు పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. ఉంతకల్లు గ్రామం వద్ద రిజర్వాయర్ నిర్మించాలని 15 ఏళ్ల క్రితం నిర్ణయించినా ఇప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. హెచ్చెల్సీ, హంద్రీ-నీవా నీటి నిర్వహణ లోపం జిల్లాకు శాపంగా మారిందని విమర్శించారు. అధికారంలోకి వస్తే హంద్రీ-నీవా కాలువ సామర్థ్యం పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయడంలో సీఎం చంద్రబాబు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. సాగునీటి సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లేందుకు సోమవారం కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏగఫూర్ హాజరవుతాన్నారు. సమావేశంలో కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, నాగేంద్ర, కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అ'పూర్వ'కలయిక



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. 28 సంవత్సరాల తరువాత కలవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి హెచ్ఎం వెంకటస్వామి, ఉపాధ్యాయులు రామిరెడ్డి, కమలనాభుడు, వీరభద్రప్ప, వెంకటరామయ్య, క్రిష్టయ్య చౌదరి, దస్తగిరి, రామకోటి, రామకృష్ణ, గోవిందప్ప, రత్నమ్మను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం వెంకటప్రసాద్ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ రాజశేఖర్, పూర్వ విద్యార్థులు ప్రకాష్, గంగాధర్, తిమ్మారెడ్డి, బాలాజీ, కె.శ్రీనివాసరెడ్డి, శివ, హరినాథ్, రఘు, ఎ.శ్రీనివాసులు, గోవిందు, రాము, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెప్పింది 210... నడిపింది 173



ప్రయాణికుల కోసం అనంతపురం బస్టాండ్ పాయింట్‌లో నిలిపిన బస్సులు

- స్పెషల్ బస్సుల నిర్వహణలో అధికారుల వైఫల్యం
- సౌకర్యాలలేమితో ప్రైవేట్ బస్సులను ఆశ్రయించిన ప్రయాణికులు
- బెంగళూరు, హైదరాబాదు మినహా ఇతర ప్రాంతాలపై దృష్టి సారించని వైనం
- అధికారుల మధ్య సమన్వయలోపంతో భారీగా తగ్గిన ఆదాయం

డిపో	బస్సుల సంఖ్య	ఆదాయం
అనంతపురం	48	రూ.13,24,318
గుత్తి	2	రూ.68,395
గుంతకల్లు	14	రూ.3,88,401
కళ్యాణదుర్గం	13	రూ.3,79,305
రాయదుర్గం	24	రూ.7,87,240
తాడిపత్రి	45	రూ.13,50,920
ఉరవకొండ	27	రూ.8,21,965

అనంతపురం క్రైం: ఆర్టీసీ అధికారులు మాటలకు చేతలకు పొంతన లేకుండా పోయింది. ఫలితంగా దసరా ఆదాయానికి భారీగా గండిపడింది. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం లేక పోవడంతో కేవలం బెంగళూరు, హైదరాబాద్‌కు మినహా మరే సుదూర ప్రాంతానికి బస్సులు నడపలేదు.

ప్రయాణికులు కిటకిట.. బస్సులు వెలవెల

ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన జిల్లా వాసులు దసరా పండుగను సొంతూర్లలో జరుపుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. ఈ క్రమంలో దసరా సెలవుల్లో ప్రత్యేక బస్సులను నడపడం ద్వారా గతంలో ఆర్టీసీ గణనీయమైన ఆదాయాన్ని గడిస్తూ వచ్చింది. ఈ దసరాకూ 210 ప్రత్యేక బస్సులు నడుపుతున్న చెపిపన ఆర్టీసీ అధికారులు కంటి తుడుపుగా 173 బస్సులు మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చారు. డిపోల వారీగా బస్సులను ఏర్పాటు చేయడంలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. ప్రయాణికులకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చే సిబ్బందిని అందుబాటులో ఉంచకపోవడంతో చాలా మంది యాప్‌ల ద్వారా ప్రైవేట్ వాహనాల్లో టికెట్లు బుక్ చేసుకున్నారు. ఫలితంగా జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉన్నా.. ఆర్టీసీ బస్సులు మాత్రం వెలవెలబోయాయి. అదనపు చార్జీలు వసూలు చేసిన రోజుల్లో కూడా అనంతపురం ఆర్టీసీ రీజియన్ నుంచి 200లకు పైగా బస్సులు నడిపేవారు. లక్షలాది రూపాయలు ఆదాయం వచ్చేది. ఈ సారి అదనపు చార్జీలు లేకపోయినా ఆదాయం మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. దీనికి తోడు రాకపోకలకు ఒకేసారి రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు పది శాతం రాయితీ ఇస్తామని ప్రకటించినా ప్రయాణికులు ముందుకు రాలేదంటే ఆర్టీసీ బస్సుల నిర్వహణ ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

డిపోల వారీగా దసరా ఆదాయమిలా..

అనంతపురం ఆర్టీసీ రీజియన్ పరిధిలోని 7 డిపోల నుంచి దసరా ప్రత్యేక బస్సులను ఏడు రోజుల పాటు నడిపారు. వీటి ద్వారా సమకూరిన ఆదాయాన్ని అధికారులు గత బుధవారం మీడియాకు వెల్లడించారు. ఏటా దసరా సమయంలో రూ.75 లక్షలకు పైగా ఆదాయాన్ని గడించే అనంతపురం ఆర్టీసీ రీజియన్ ఈ సారి రూ.51,20,544కు మాత్రమే పరిమితం కావడం గమనార్హం.

ప్రమాదం కాదు.. హత్యే!

- బొమ్మన్న మృతి కేసులో వీడిన మిస్టరీ
- హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన కన్న కొడుకు



బొమ్మన్న(ఫైల్)

రాయదుర్గం టౌన్: స్థానిక సిద్ధేశ్వర కాలనీలో నివాసముంటున్న బొమ్మన్న మృతి కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. కన్న కొడుకే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు నిర్ధారించారు. వివరాలను సీఐ జయానాయక్ ఆదివారం వెల్లడించారు. తాగునీటి పథకానికి సంబంధించి వాటర్ ట్యాంక్ నిర్వహణతో పాటు, పొలం పనులతో జీవనం సాగిస్తున్న బొమ్మన్నకు భార్య శివమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు నాగరాజు వ్యసనాలకు బానిసై తరచూ వేధిస్తుండడంతో ఆయన భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలోనే డబ్బు కోసం తండ్రితో గొడవ పడేవాడు. నాగరాజు ఆగడాలు శ్రుతి మించడంతో తండ్రి తీవ్రంగా మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న నాగరాజు శనివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని వస్తున్న తండ్రిని మల్లాపురం తండా సమీపంలో అడ్డుకుని గొడవ పడ్డాడు. ముందుగానే సిద్ధంగా ఉంచుకున్న కొడవలితో నరికాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న సమీప బంధువు సురేష్ వారించబోయినా వినలేదు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న తండ్రిని చూస్తూ ఈ విషయాన్ని ఎవరితోనైనా చెబితే హతమారుస్తానంటూ సురేష్‌నూ బెదిరించాడు. అనంతరం బొమ్మన్న (45) మృతదేహాన్ని ఆటోలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి మృతిచెందినట్లుగా అందరినీ నమ్మించాడు. దీంతో తొలుత ప్రమాదంలో మృతి చెందినట్లుగానే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అయితే తన తండ్రిని హతమార్చబోతున్నట్లు చెల్లెలుకు నాగరాజు వీడియో కాల్ చేసి తెలిపిన విషయం బయటపడింది. ఇదే సమయంలో సురేష్ కూడా జరిగిన ఘటనను కుటుంబసభ్యులకు వివరించాడు. దీంతో శనివారం రాత్రే ఆస్పత్రి నుంచి నాగరాజు పరారయ్యాడు. హతుడు బొమ్మన్న భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నాగరాజు కోసం గాలిస్తున్నారు.

'ఉపాధి' నిధులతో రోడ్ల నిర్మాణం

- జిల్లాకు రూ.95.39 కోట్లు విడుదల

అనంతపురం సిటీ: జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, తారు రోడ్ల నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం కింద నిధులు విడుదలయ్యాయి. మొత్తం 1,734 పనులకు సంబంధించి 199.53 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి రూ.95.39 కోట్లు విడుదలైనట్లు పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ మహమ్మద్ జహీర్ అస్లాం తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 4.50 కిలోమీటర్ల మేర 2 బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్లు, శింగనమలలో రూ.50 లక్షలతో ఓ రోడ్డు, తాడిపత్రిలో 6.50 కిలోమీటర్ల మేర 4 రోడ్లు, ఉరవకొండలో 2.50 కిలోమీటర్ల మేర రెండు రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. వీటికి రూ.5.50 కోట్లు ఖర్చు పెట్టనున్నట్లు వివరించారు. అలాగే నియోజకవర్గాల వారీగా సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి అనంతపురం అర్బన్ పరిధిలో రూ.290 కోట్ల వ్యయంతో 40 పనులు, గుంతకల్లులో రూ.6.50 కోట్లతో 147 పనులు, కళ్యాణదుర్గంలో రూ.11.47 కోట్లతో 150 పనులు, రాప్తాడులో రూ.9.61 కోట్లతో 175 పనులు, రాయదుర్గంలో రూ.16ఉ.05 కోట్లతో 416 పనులు, శింగనమలలో రూ.15.49 కోట్లతో 319 పనులు, తాడిపత్రిలో రూ.11.61 కోట్లతో 149 పనులు, ఉరవకొండలో రూ.14.76 కోట్లతో 329 పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

'లేదాళ్ల'కు పురస్కార ప్రదానం



విమలా శాంతి సాహితీ పురస్కారం అందుకుంటున్న లేదాళ్ల రాజేశ్వరరావు

అనంతపురం కల్చరల్: ఆధునిక సాహిత్యానికి పట్టుగొమ్మగా రాయలసీమ విరాజిల్లుతోందని పలువురు వక్తలన్నారు. వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న విమలా స్మారక సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాదికి గాను తెలంగాణ కవి లేదాళ్ల రాజేశ్వరరావుకు అందించారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ శాంతినారాయణ, ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి, రాజారాం, డాక్టర్ అంకె శ్రీనివాస్, సడ్లపల్లి చిదంబరరెడ్డి, కొత్తపల్లి సురేష్ తదితరులు ప్రసంగించారు. చాలా ప్రాంతాల వారికి అనంత సాహిత్యం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని పురస్కార గ్రహీత రాజేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ, రచయితలు మారుతి, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నాగమ్మ (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గాండ్లవీధికి చెందిన శతాధిక వృద్ధురాలు సుంకర నాగమ్మ (106) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు సుంకర నారాయణ, సుంకర పుల్లమ్మ, మనవళ్లు, మనవరాళ్లు సుంకర సరేష్, సతీష్, నారాయణస్వామి, రమాదేవి, నాగేశ్వరి తదితరులు ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. బంధుమిత్రులతో పాటు వార్డులోని ప్రజలు నాగమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

క్లుప్తంగా

గ్రంథాలయంలోకి వెళ్లేదెలా?


గ్రంథాలయం ముందు నిలిచిన వర్షపు నీరు

రాప్తాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు స్థానిక గ్రంథాలయం ముందు వర్షపు నీరు భారీగా నిలిచింది. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు దారి లేక వెనక్కి వెళ్లిపోతున్నారు. చేసేదేమీ లేక గ్రంథాలయం కూడా తెరవడం లేదు. వర్షం వస్తే గ్రంథాలయం ముందు వర్షం నీరు నిలబడుతోంది. మట్టి తోలించాలని గ్రంథాలయాధికారి వీరా నారాయణ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచించినా స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టితో గుంతలను పూడ్చాలని పాఠకులు కోరుతున్నారు. అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పాఠకులు చెబుతున్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక' జరగనుంది. నగరంలోని వివిధ డివిజన్లలో ఏమైనా సమస్యలుంటే ప్రజలు తెలియజేయవచ్చని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. వివిధ విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని అర్జీదారులు కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

అనిల్ కుమార్‌కు గ్లోబల్ అవార్డు



గ్లోబల్ టూరిజం అవార్డు అందుకుంటున్న అనిల్‌కుమార్ రెడ్డి

అనంతపురం కల్చరల్: సామాజిక సేవా కార్యకర్త ఏజీ అనిల్ కుమార్‌రెడ్డి గ్లోబల్ టూరిజం అవార్డు అందుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో చారిత్రాత్మక ప్రదేశాలకు విశేష గుర్తింపు, పూర్వ వైభవం వచ్చేలా సేవలందిస్తున్న వారికి ఈ అవార్డు అందజేస్తారు. జిల్లాలోని 14వ శతాబ్దానికి చెందిన కాశీవిశ్వేశ్వరాలయానికి చెందిన కోనేరు శిథిలావస్థకు చేరుకోవడంతో రెండేళ్ల క్రితం ఏజీ అనిల్ కుమార్‌రెడ్డి సొంత నిధులను వెచ్చించి పునఃవైభవం తీసుకొచ్చారు. ఉత్తమ సేవలందిస్తున్న ఈయనకు తెలంగాణ రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా గ్లోబల్ టూరిజం అవార్డు అందజేశారు. అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవలందించేందుకు తాము ముందుకొస్తున్నా ప్రస్తుత ప్రభుత్వ శాఖలు సహకరించడం లేదన్నారు. అధికారం యంత్రాంగం మేల్కొకపోతే భావితరాల వారికి అద్భుతమైన చరిత్రను అందించలేమని ఆవేదన వ్యక్తం చేశారు.

23న అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

రాప్తాడు: ఐసీడీఎస్ అనంతపురం రూరల్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఒక మినీ అంగన్‌వాడీ వర్కర్, 9 ఆయా పోస్టుల భర్తీకి ఈనెల 23న అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ ధనలక్ష్మి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం రూరల్ మండల పరిధిలోని టీవీ టవర్స్ కాలనీ మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, పీసీ కాలనీ, కందుకూరు-3, ఎంబీ పల్లి, బిందెల కాలనీ, ఆత్మకూరు మండలం ముట్టాల, కుర్లపల్లి, రాప్తాడు మండలం బొమ్మేపర్తి, మరూరు-3, రాప్తాడు-3 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్పకుండా తీసుకురావాలని తెలిపారు.

సర్పరూపుడికి విశేష పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామిని పట్టు వస్త్రాలతో పాటు బంగారు ఆభరణాలతో అలంకరించి ఆకుపూజ చేశారు. ఆలయంలో స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు, కాలసర్పదోష నివారణ హోమాలు చేశారు. అలాగే ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు, అభిషేకాలు చేపట్టారు.

వర్షం.. మిగిల్చింది నష్టం

- తుపాను దెబ్బకు రైతన్నల విలవిల
- పొలాల్లోనే కుళ్లుతున్న వేరుశనగ, పత్తి
- దెబ్బతిన్న ఆముదం, కంది, కాయగూరల పంటలు


కనగానపల్లి మండలంలో పొలంలోనే కుళ్లిపోతున్న వేరుశనగ


పర్వతదేవరపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి

కనగానపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల వరుసగా కురిసిన వర్షాలు రైతన్నలకు నష్టాలు మిగిల్చాయి. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు తుపానుకు దెబ్బతిన్నాయి. పంటలు చేతికి వచ్చే సమయంలో పాడైపోవడంతో రైతుల కష్టమంతా నీరుగారిపోయింది. ఈ వర్షాలతో రాప్తాడు నియోజకవర్గంలో సుమారు 15 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు సమచారం. ముఖ్యంగా ఖరీఫ్‌లో సాగుచేసి కోత దశలో ఉన్న వేరుశనగ, పత్తి, ఆముదం, కంది పంటలు చాలా దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు.

56 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు..

నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 56 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. చాలా చోట్ల పంట కాలం పూర్తి కావడంతో కోతలు ప్రారంభించారు. ఈ సమయంలో తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. తొలగించిన వేరుశనగ పొలాల్లోనే కుళ్లిపోతోంది. వేరుశనగ కాయలతో పాటు పశుగ్రాసం కూడా దక్కే పరిస్థితి లేదని ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పంట తొలగించని చోట చెట్లలోనే కాయలు మొలకలు పోతున్నాయి. తుపాన్‌తో నియోజకవర్గ వ్యాప్తంగా 6 వేల ఎకరాలకు పైగా వేరుశనగ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఇంకా పొలాల్లో పర్యటించలేదని రైతులు చెబుతున్నారు.

కాయగూరల పంటలు వర్షార్పణం

వేరుశనగ, కంది, పత్తి, ఆముదంతో పాటు బోరు బావుల కింద కాయగూరల పంటలు కూడా ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం కంది, పత్తి, ఆముదం పంటలు కూడా మొగ్గ దశలో ఉన్నాయి. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కందిలో పూత, ఆముదం, పత్తి పంటలో కాయలు రాలిపోతున్నాయి. నియోజకవర్గం వ్యాప్తంగా ఏటా సుమారుగా 15 వేల ఎకరాల్లో కంది పంట సాగవుతుంది. ఇందులో పూత, కాయదశలో ఉన్న 8 వేల ఎకరాల దాకా పంట దెబ్బతిన్నట్లు కనగానపల్లి, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, ఆత్మకూరు మండలాల రైతులు తెలిపారు. ఇక వీటితో పాటు కనగానపల్లి మండలం పర్వతదేవరపల్లిలో 200 ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంట వర్షాలకు దెబ్బతింది. వేపకుంట, తూంచర్ల, భానుకోట గ్రామాల్లో సాగు చేసిన ఆముదం పంట కూడా తుపాన్‌తో దెబ్బతింది. బోరుబావుల కింద సాగు చేసిన టమాట, బెండ, మిరప తదితర కాయగూరల పంటలు వర్షార్పణం అయ్యాయి.

పొలాల్లోనే వేరుశనగ

నేను 10 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. పంట కాలం పూర్తి కావడంతో వారం రోజుల క్రితం పంట తొలగించాను. వేరుశనగ తొలగించిన తర్వాత వరుసగా వర్షాలు కురిశాయి. వేరుశనగ కట్టెంతా పొలంలోనే తడిచిపోయింది. ఆరు రోజుల తర్వాత పొలంలోనే పంట నూర్పిడి చేసుకోవాల్సి వచ్చింది. వర్షానికి పంట తడవడంతో కాయలతో పాటు పశుగ్రాసం కూడా దెబ్బతింది. ఆర్థికంగా చాలా నష్టపోయాను. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– గోపాల్‌రెడ్డి, రైతు, ఆత్మకూరు

పత్తి కాయలు రాలిపోతున్నాయి..



ఖరీఫ్‌లో మెట్ట భూముల్లో పత్తి పంట సాగు చేశాం. ప్రారంభంలో వర్షాలు సరిగా పడకపోవడంతో పంట ఏపుగా పెరగలేదు. ఆ తర్వాత కురిసిన వర్షాలకు పంట పెరిగి పూత, మొగ్గ దశకు చేరుకుంది. మళ్లీ తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో పత్తి కాయలు బూజుపట్టి రాలిపోతున్నాయి. మా గ్రామంలో సుమారు 150 ఎకరాల దాకా పత్తి పంటలు దెబ్బతిన్నాయి. అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించాలి. రైతులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– శ్రీనివాసులు రెడ్డి, పర్వతదేవరపల్లి, కనగానపల్లి మండలం

'పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారు'


మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: సాక్షి ఎడిటర్ మురళీపై కేసు నమోదు చేయడం ముమ్మాటికీ పత్రిక స్వేచ్ఛపై దాడి చేయడమేనని మేయర్ వసీం పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. నిజాలు నిర్భయంగా రాస్తే జీర్ణించుకోలేక ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయడానికి కేసు నమోదు చేశారన్నారు. నిజంగా తప్పు రాసి ఉంటే ఖండన ఇవ్వచ్చని పేర్కొన్నారు. అలా చేయకుండా భయపెట్టే ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అంతిమ విజయం ప్రజలదే అన్నారు. అలాకాకుండా తాము చెప్పినట్లు పత్రికలు కూడా నడుచుకోవాలని అనుకోవడం అవివేకమవుతుందన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల తన పరిపాలనలో పత్రికలు ఎన్నోసార్లు ఆయన మీద వ్యతిరేకంగా వార్తలు రాస్తే ధైర్యంగా ఆయనతో పాటు మంత్రులు అందరూ ముక్తకంఠంతో ఖండించే వారన్నారు. విజయవాడ వరదల్లో నిజంగా సహాయం అందించి ఉంటే ధైర్యంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి వరద సాయంలో ఏ విధమైన తప్పు, అక్రమాలు జరగలేదని ఎందుకు చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు.

ఘనంగా బాబా అవతార ప్రకటన దినోత్సవం


అన్నదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన పుట్టపర్తి సాయిబాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని ఆదివారం పలు ఆధ్యాత్మిక, సేవా సంస్థలు ఘనంగా జరుపుకున్నాయి. తెల్లవారు జామునే నగరోత్సవం, సాయంత్రం పల్లకీ సేవ, భజనలతో మార్మోగించారు. సాయిట్రస్టు, శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధులు నగరంలోని పలుచోట్ల నారాయణసేవ పేరిట అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1960 అక్టోబర్ 20న ఉరవకొండ పట్టణంలో సత్యసాయి బాబా తన అవతార ప్రకటనను వెల్లడించారని తెలిపారు. ఆ రోజు నుంచి క్రమం తప్పకుండా ఆనాటి ప్రాధాన్యతను తెలిపే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అనంతకు అంతర్జాతీయంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు వచ్చాయన్నారు. అందులో సత్యసాయి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అంతకు ముందు బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు, ఆరాధన, గ్రామోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, విగ్నేష్ రమణ లత, వీరేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అనంతపురం: నగర శివారులోని ఎస్ఆర్ స్కూల్‌లో హాస్టల్‌లో ఉంటూ చదువుతున్న ఇటుకలపల్లి గ్రామానికి ఓ బాలుడు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు బయటకెళ్లిపోయి వాళ్ల తాతకు ఫోన్ చేశాడు. తాను ఎక్కడికో వెళ్లిపోతున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. తల్లిదండ్రుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న అనంతపురం నాల్గో పట్టణ పీఎస్ సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి బాలుడి కోసం గాలింపు చేపట్టారు. కందుకూరు వద్ద బాలుడిని గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే బాలుడి ఆచూకీ కనుగొని అప్పగించిన ఏఎస్ఐ నగేష్, సిబ్బందిని సీఐ సాయినాథ్ అభినందించారు.

సంగీతం, సాహిత్యాలతో మనోవికాసం


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామి ఆత్మవిదానంద సరస్వతి

అనంతపురం కల్చరల్: సంగీతం, సాహిత్యంతోనే మనో వికాసం సాధ్యమవుతుందని చిన్మయానంద మిషన్ జిల్లా ఇన్‌చార్జి స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. కొద్ది రోజులుగా సాంస్కృతిక సంబరాలకు దూరంగా ఉన్న శ్రీత్యాగరాజ సంగీత సభలో ఆదివారం రాత్రి శాస్త్రీయ సంగీత నృత్య వేడుకలు పునః ప్రారంభం అయ్యాయి. ప్రఖ్యాత కేరళ నృత్య కళాకారిణి అల వేణుగోపాల్ ప్రదర్శించిన వివిధ నాట్యరీతులు ఆకట్టుకున్నాయి. 'అంకురం' పేరుతో సాగిన వేడుకల్లో ప్రఖ్యాత కళాకారిణి కేరళకు చెందిన అలా వేణుగోపాల్ నాట్య ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా స్వామి ఆత్మవిదానందతో పాటూ త్యాగరాజ సంగీత సభ నిర్వాహకులు సంపత్‌కుమార్, ఆచార్య సుధాకరబాబు, కవి నబీరసూల్, చార్టెడ్ అకౌంటెంట్ హరిశ్చంద్రరామ, సీనియర్ న్యాయవాది హరికృష్ణ తదితరులు మాట్లాడారు. దేశవిదేశాల్లో మోహినీ అట్టం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న అల వేణుగోపాల్ నృత్య ప్రదర్శనతో మళ్లీ సంగీత సభకు పూర్వ వైభవం రావడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో క్రమం తప్పకుండా వివిధ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణతోనే 'అనంత' సుభిక్షం


ప్రశంసాపత్రం అందుకుంటున్న యువ వలంటీర్

అనంతపురం కల్చరల్: పర్యావరణ పరిరక్షణతోనే అనంత ప్రాంతం సుభిక్షంగా మారుతుంది. అందుకు యువత కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. 'ఏక్ పేడ్ మా కా నామ్' అనే పేరుతో ఆదివారం నెహ్రూ యువకేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఎన్‌వైకే, ప్రగతి పథం, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ సాకే గోపీనాథ్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు భరత్, జీవన్ కుమార్, జయమారుతీ, సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ప్రణతి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మ పేరు మీద జిల్లా అంతటా చెట్లు విరివిగా నాటడం, వాటిని పరిరక్షించుకోవడం ఉద్యమంలా సాగాలన్నారు. ముఖ్యంగా యువతకు జిల్లాను సశ్యశ్యామలం చేసే బాధ్యతను అప్పగిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్రం అధికారులు వెల్లడించారు. అనంతరం క్విజ్, పోస్టర్ మేకింగ్, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన యువతీ యువకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పవన్, నందిత, ప్రెసిల్లా, హర్ష తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ శేఖర్ బాధ్యతల స్వీకరణ

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా ఎన్.శేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లి రూరల్ సీఐగా పని చేస్తున్న ఈయన ఇటీవల బదిలీపై వచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ స్టేషన్లలో ఎస్ఐగా పని చేశారు. తాడిమర్రి, నార్పల, రామగిరి, హిందూపురం రూరల్, హిందూపురం వన్‌టౌన్, ఏపీ ట్రాన్స్‌కోలో పని చేశారు. 2023లో సీఐగా పదోన్నతి పొంది మదనపల్లి రూరల్ పీఎస్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి అనంతపురం రూరల్ మండల పీఎస్‌కు వచ్చారు. బాధ్యతలు తీసుకున్న ఆయనకు ఎస్ఐలు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే రూరల్ పీఎస్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శేఖర్ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న పెద్దన్న, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రమణ, తెలుగు రైతు రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు కురుగుంట నారాయణ స్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు పుష్పరాజ్, రామకృష్ణ, పక్కీరప్ప తదితరులు సీఐను సన్మానించారు.

భవన సముదాయాలు త్వరగా సమకూర్చుకోవాలి


కోర్టు సముదాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

హిందూపురం టౌన్: హిందూపురంలో న్యాయస్థానాల నిర్వహణకు త్వరగా భవన సముదాయాలు సమకూర్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ సూచించారు. ప్రస్తుతం హిందూపురం న్యాయ సముదాయంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక న్యాయస్థానం భవన సముదాయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ఇతర ప్రభుత్వ భవన సముదాయాల్లో ఆయా న్యాయస్థానాల నిర్వహణకు అందుబాటులో ఉన్న భవనాలను ఆదివారం జిల్లా జడ్జి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పరిశీలించారు. తొలుత డీజే, జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్ స్థానిక సబ్ కోర్టు ఆవరణలో న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రస్తుతం కోర్టుల నిర్వహణకు అందుబాటులో ఉన్న భవన సముదాయాలపై న్యాయవాదులతో చర్చించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న అదనపు జిల్లా కోర్టు, సబ్ కోర్టులకు సమీపంలోనే ఉన్న పశు వైద్యశాల భవన సముదాయం ఎంతో అనువుగా ఉంటుందని చెప్పడంతో.. ఆ భవన సముదాయాన్ని జిల్లా జడ్జి, జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, రంగారెడ్డి, సుదర్శన్, సిద్ధు, నాగరాజురెడ్డి, సదాశివరెడ్డి, ప్రసాద్ రెడ్డి, రవిచంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాలు, హత్యలపై స్పందించరా?

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువయ్యాయి. వెంటనే మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కొడవండ్ల డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడారు. అత్యాచారాలు, హత్యలపై స్పందించరా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షులు వన్నూరు స్వామి, దినేష్, ఆనంద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


గౌరీ ప్రతిమను అలంకరించిన దృశ్యం

గౌరమ్మ దేవతకు పూజలు

నగరంలోని రుద్రంపేటలో ఆదివారం గౌరీ దేవికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. యువతులు, చిన్నారులు మహిళలు ఇంటి దగ్గరి నుంచి జ్యోతులు తలపై ఎత్తుకుని ఊరేగించారు. అంతకుముందు గౌరమ్మ దేవతను పట్టుచీర, గాజులు, పూలతో అలంకరించారు. అనంతరం మహిళలు వీధిలో ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


మదిగుబ్బ పరిసరాల్లో పచ్చని పైరు మధ్య అందంగా ఉన్న కొబ్బరి చెట్లు


నిండుకుండలా మారిన సింగంపల్లి చెరువు

పల్లె సోయగం..

ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు ఆత్మకూరు మండలంలోని మదిగుబ్బ, సింగంపల్లి చెరువులు నిండుకుండలా మారాయి. ఎటు చూసినా కనుచూపు మేర పరుచుకున్న పచ్చదనం అందరినీ మంత్రముగ్ధుల్ని చేస్తోంది. చల్లని గాలి, అందమైన ఆహ్లాదకరమైన వాతావరణం మనస్సును ఇట్టే కట్టి పడేస్తోంది. ప్రస్తుతం మండలంలో దాదాపు 4 వేల ఎకరాల వరకూ వరి సాగు చేశారు. వరి పైరు పచ్చగా కళకళలాడుతుండగా.. పలుచోట్ల వరిమడులు కోతలకు సిద్ధంగా ఉన్నాయి. ఒకసారి ఈ అందాలను చూస్తే మళ్లీ మళ్లీ ఇక్కడికే రావాలని అనిపిస్తుంది.

– ఆత్మకూరు:


నీటితో కళకళలాడుతున్న మదిగుబ్బ చెరువు


కోతకు వచ్చిన వరిమడి